## గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పిస్తాం

- వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



గ్రంథాలయంలోని వసతులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

కొత్తకోట, మార్చి 22 : గ్రంథాలయంలో పాఠకుల అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పేర్కొన్నారు. కొత్తకోట పట్టణంలోని గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు వేములశ్రీనివాస్‌రెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. పుస్తకాలు, స్టడీ చైర్లు, లైటింగ్, ఫ్యాన్, దూమ్ము రాకుండా కిటికీలకు గ్లాస్ ఫిటింగ్, వాహనాల కోసం పార్కింగ్, తాగునీటి వసతి, మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, గ్రూప్స్ స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచాలని విన్నవించారు. అందుకు అద నపు కలెక్టర్ స్పందిస్తూ ఎన్నికల కోడ్ అ నంతరం అన్ని వసతులు కల్పిస్తామన్నా రు. అంతకు ముందు గ్రంథాలయానికి ఆనుకొని ఉన్న దుకాణ సముదాయాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పట్టణవాసులు సురేశ్‌సిం గ్, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

## ఈత విషాదం కాకూడదు :ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, మార్చి 22 : వేసవి కాలం దృష్ట్యా పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభం కావడంతో ఎంతో మంది చిన్నారులు, యువకులు ఎండ వేడి నుంచి సేద తీరటానికి, ఈత నేర్చుకోవడానికి జలాశయాల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ రితి రాజ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల సమయం పూర్తయ్యాక పిల్లలు ఇంటికి వచ్చారా లేదా ఎక్కడికైనా స్నేహితులతో వెళ్లారా అన్న విషయాలపై తల్లిదండ్రులు ఆరా తీయాలని సూచించారు. మీ పిల్లలు కనిపించకపోతే తక్షణమే 100 కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. పిల్లలు జలాశయాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**ఫిర్యాదుదారులకు అందుబాటులో**

ఫిర్యాదుదారులకు మరింత చేరువగా ఉండాలనే ఉద్దేశంతో ఈనెల 28వ తేదీన శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉంటున్నట్లు ఎస్పీ రితిరాజ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను తెలిపేందుకు జిల్లా కేంద్రానికి రాలేని వారు, ఫిర్యాదులు పరిష్కారం కాలేదని భావించిన వారు, ఇతర బాధితులు ఎవరైనా 28వ తేదీన శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. బాధితుల పక్షాన పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని గుర్తు చేశారు.

## జల సంరక్షణ ప్రజలందరి బాధ్యత

- జిల్లా హైడ్రో జియాలజిస్ట్ యుగంధర్‌రెడ్డి



భూగర్భ జలాలపై అవగాహన కల్పిస్తున్న జియాలజిస్ట్ యుగంధర్‌రెడ్డి

వనపర్తి టౌన్, మార్చి 22 : భూగర్భ జలాల పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా హైడ్రో జియాలజిస్ట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. భూగర్భ జలం నిర్వహ ణ అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భూగర్భ జల పరిరక్షణ ప్రజలందరి తక్షణ కర్తవ్యం అని అన్నారు. నీటి పొదుపు, సంరక్షణ, నీటి లెక్కింపు, ఇంకుడు గుంతల ఏర్పాటు, ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్, డాక్టర్ వెంకటప్రసాద్, గోవర్ధన్, స్వాతి, ఆంజనేయులు, శివ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం




నిల్వ నీటిని పారబోయిస్తున్న అధికారులు

పెబ్బేరు, మార్చి 22 : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని జిల్లా ఇన్‌చార్జి మలేరియా నివారణ అధికారి శ్రీనివాస్‌జీ అన్నారు. డ్రైడే సందర్భంగా శుక్రవారం పెబ్బేరు మండలం యాపర్లలో యాంటీ లార్వా టీంతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులను నివారించాలంటే దోమలు వృద్ధి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు వ్యాప్తికి కారణమైన నిల్వ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శివారెడ్డి, రాజు, శ్రీనివాసులు, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.33 లక్షలు నగదు, 86.83 లీటర్ల మద్యం పట్టివేత

వనపర్తి టౌన్, మార్చి 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 1,33,400వేల నగదు, 86.83 లీటర్ల మద్యం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితమూర్తి తెలిపారు. వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.80,900, మదనాపురంలో రూ.52,500 నగదు, అమరచింతస్టేషన్ పరిధిలో 8.850 లీటర్ల మద్యం, వనపర్తిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 34. 375 లీటర్లు, రేవల్లి పరిధి లో 24.095లీటర్లు, చిన్నంబావిలో 11.07, ఆత్మకూర్‌లో 8.450 లీటర్ల మద్యం మొత్తం రూ.1,33,400వేల నగదు, 86.83 లీటర్ల మద్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## వేసవి దుక్కులపై రైతులకు అవగాహన



లోతు దుక్కులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో భరత్‌సింహ

ఇటిక్యాల, మార్చి 22: మండలంలోని చాగాపురం రైతువేధికలో శుక్రవారం వ్యవసాయ విస్తరణాధికారి భరత్‌సింహ వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వేసవిలో రైతులు చేపట్టాల్సిన వ్యవసాయ పనుల గురించి వివరించారు. రైతులు పంట కాలం ముగియగానే పొలంలో వాలుకు అడ్డంగా లోతు దుక్కులు చేపట్టడం వల్ల తర్వాత సాగు చేసే పంటకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. లోతు దుక్కుల వల్ల గట్టిపడ్డ భూమి గుల్లబారుతుందని, భూమిలోని క్రిమికీటకాల లార్వాలు ఎండ వేడిమికి చనిపోతాయన్నారు. అలాగే పడిన ప్రతి వర్షపు చినుకు భూమిలోకి ఇంకి పంటలు వర్షాభావ పరిస్థితులు తట్టుకునే శక్తి వస్తుందన్నారు. రైతులు లోతు దుక్కులు చేసేందుకు ఇది తగిన సమయమన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ ప్రైవేట్ పరం

- ప్రతి ఇంటికీ రూ.60 చొప్పన వసూలు
- ఏజెన్సీకి అప్పగిస్తూ బల్దియా నిర్ణయం
- మున్సిపాలిటీకి తగ్గనున్న ఆర్థిక భారం



చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)

గద్వాలటౌన్, మార్చి 22 : మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీ కి అప్పగిస్తూ పురపాలక అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు మున్సిపాలిటీ కార్మికులు ఇంటింటికీ తిరుగు తూ తడి పొడి చెత్తను సేకరిస్తున్నారు. తాజాగా ప్రైవేట్ ఏ జెన్సీకి ఆ బాధ్యతలు అప్పగించి ఇంటింటి నుంచి చెత్త సేకరణ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చార్జీలు రూ.60చొప్పున వసూలు చేయనున్నారు. అలాగే వ్యాపార సంస్థ లు, ఫంక్షన్‌హాళ్లు, మాల్స్ తదితర వాటికి ప్రత్యేక ధరలు నిర్ణయించనున్నారు.

***ప్రస్తుతం 37 వార్డుల్లో..***

గద్వాల మున్సిపాలిటీలో 37 వార్డులు ఉ న్నాయి. గతేడాది మేలో మొదటి విడుతలో ఏడు వార్డులను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిం చారు. ఏజెన్సీవారు ప్రతి ఇంటికి తిరిగి వి ధిగా చెత్త సేకరించాలని నిర్ణయించారు. దీంతో రెండు నెలల పాటు చెత్త సేకర ణ సాఫీగా సాగింది. అయితే ఈ నిర్ణయాన్ని కొందరు కౌన్సిలర్లు పూర్తిగా వ్యతిరేకించారు. దీంతో తిరిగి ము న్సిపల్ కార్మికులే చెత్త సేకరణ చే పడుతున్నారు. కాగా ప్రభుత్వ నిర్ణయం మేరకు తాజాగా జనవరిలో నిర్ణయించిన కౌన్సిల్ సమావేశంలో చెత్త సేకరణ ప్రైవేట్ పరం చేయాలని కౌన్సిల్ తీర్మానించింది.

***తగ్గనున్న ఆర్థిక భారం..***

ప్రైవేట్ ఏజెన్సీకి చెత్త సేకరణ బాధ్యత అప్పగించడం ద్వారా మున్సిపాలిటీకి ఆర్థిక భారం తగ్గనున్నది. అయితే సదరు ప్రైవేట్ ఏజెన్సీకి వాహన సదుపాయం మాత్రం మున్సిపాలిటీయే కల్పించాలి. డీజిల్, లేబర్ ఖర్చులన్నీ ఏజెన్సీవారే భరించాలి. దీంతో ప్రతి నెలా డీజిల్, కార్మికుల వేతనాల చెల్లింపులు ఉండవు. దీంతో ప్రతి నెలా బల్దియాకు కొంతమేర ఖర్చులు ఆదా కానున్నాయి.

***ప్రతి రోజూ సేకరణ..***

ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడంతో ప్రతి రోజూ చెత్త సేకరణ చే పడతారు. రోడ్లపై చెత్తను వేస్తే జరిమానా విధిస్తారు. వార్డుల్లో చెత్త పేరుకుపోతే ఏజెన్సీవారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అం దుకే ఏజెన్సీ వారు విధిగా చెత్త సేకరణ చేపడితే వార్డులు, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

***ఇబ్బందులు పడుతున్న ప్రజలు..***

చెత్త సేకరణ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. కానీ ఏజెన్సీ తీసుకున్న సదరు కార్మికులు కొన్ని వార్డుల్లో మాత్రమే చెత్తను సేకరిస్తూ మిగతా వార్డుల్లో సక్రమంగా చేయడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కచ్చితంగా డబ్బులు చెల్లించాలన్న నిర్ణయంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

***కౌన్సిలర్ల నుంచి వ్యతిరేకత..***

ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడాన్ని కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇలా చేస్తే ప్రస్తుతం చెత్త సేకరిస్తున్న కార్మికులు, డ్రై వర్లు జీవనభృతిని కోల్పోయే అవకాశం ఉందని, వారికే బాధ్యతలు అప్పగించాలని చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లు సూచిస్తున్నారు.

**ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే..**



ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే అమలు చేస్తాం. ప్రస్తుతం ప్రైవేట్ ఏజెన్సీ వారే చెత్తను సేకరిస్తున్నట్లు తెలిసింది. గతంలో పనిచేసిన వారిని దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయం తీసుకుంటాం.

– శంకర్‌సింగ్, మున్సిపల్ కమిషనర్, గద్వాల

## మొక్కలు ఎండకుండా చూడాలి

పెద్దమందడి, మార్చి 22: వేసవిలో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా ప్రతి రోజూ నీరు పట్టాలని ఎంపీవో శ్రీరామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం చేపట్టిన చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో నాటిన ప్రతి మొక్కకూ నీరు పట్టి సంరక్షించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళలో నీరు పట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదేవిధంగా తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణనాయక్ పాల్గొన్నారు.

## పశువులకు వ్యాక్సిన్ వేయించాలి

గద్వాల రూరల్, మార్చి22 : పాడిరైతులు తమ పశువులకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యాధికారి శంకరయ్య అన్నారు. మండలంలోని కాకులారం, కుర్వపల్లి, చింతలపేటలో గేదెలు, ఆవులకు, ఎద్దులకు శుక్రవారం గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది వేశారు.కార్యక్రమంలో 46మంది పాడి రైతులకు చెందిన 538పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది మాధవిలత, తేజశ్విని, రాముడు, కృష్ణయ్య, ప్రభాకర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు డబ్బు చెల్లించాలి

చిన్నంబావి, మార్చి 22 : గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు క్రమం తప్పకుండా కూలీ డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దగడపల్లి గ్రామంలో ఉపాధికూలీ పనులను వారు శుక్రవారం పరిశీలించారు. అదేవిధంగా కూలీల సమస్యలు తీర్చాలని కూలీలతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల వద్ద మంచినీరు, టెంటు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలను కల్పించాలని, అదేవిధంగా కూలీలకు ప్రమాద బీమా రూ.5లక్షలు కల్పించాలని, ప్రతి గ్రామానికి ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు రాములు, ఉపాధికూలీలు ఉన్నారు.

## మద్యం పట్టివేత

గోపాల్‌పేట, మార్చి 22 : రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కిరాణాషాపుల్లో శుక్రవారం పోలీసులు తనిఖీ చేసి మద్యం పట్టుకొని విక్రయ దారులపై కేసులు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి రెడ్డి కథనం మేరకు..గ్రామానికి చెందిన నిజాముద్దీన్, కిరణ్ కిరాణ షాపుల్లో తనిఖీ చేయగా రెండు షాపుల్లో రూ.23వేల విలువ గల 24లీటర్ల మద్యం లభించినట్లు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకొని, విక్రయదారులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## సొంత నిధులతో మూడు బోర్లు వేయించిన దాత

అమరచింత, మార్చి 22: వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పట్టణవాసి దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి సొంత నిధులతో దశమికట్ట, బీసీకాలనీలో మూడు బోర్లను వేయించడంతో తాగునీరు పుష్కలంగా రావడంతో ఆయా కాలనీల వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు శ్యాం మాట్లాడుతూ ప్రతి ఏడాది పట్టణంలోని పలుచోట్ల దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారమని, ఈసారి వేసవికాలంలో ప్రారంభంలోనే భూగర్భజాలలు ఇంకి పోవడంతో ప్రకాశ్‌రెడ్డి నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చోట్ల సొంత నిధులతో మూడు బోర్లు వేయించారని తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం

మల్దకల్, మార్చి 22 : మండలంలోని అమరవాయి గ్రామంలో గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం జెడ్పీ చైర్ పర్సన్ సరిత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, తిమ్మ య్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పాన్‌గల్, మార్చి22: మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన రైతు ఆవుల సురేశ్‌కు చెందిన ఎద్దు శుక్రవారం పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

## జములమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండ్ల సతీమణి



జములమ్మను దర్శించుకుంటున్న బండ్ల జ్యోతి

గద్వాల రూరల్, మార్చి 22 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ అమ్మవారిని శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్, ఆలయ మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్,ఆలయ కమిటీ డైరెక్టర్లు కమ్మరి సునీత, అభిలాశ్, మహిళా నాయకురాలు రాధమ్మ, మధుమతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రత్యేకదృష్టి

- పల్లెలను సందర్శించిన అధికారులు
- వినియోగంలోకి రానున్న పాత బోర్లు, చేతిపంపులు



మాచర్లలో బోర్లను పరిశీలిస్తున్న అధికారులు

గట్టు, మార్చి 22 : రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జూరాల డ్యాంలో నీటి నిల్వ రోజురోజుకూ తగ్గిపోతున్న క్రమంలో మిషన్ భగీరథ తాగునీటిని ఇబ్బందులు ఎదురైతే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు పల్లెల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరులపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. మిషన్ భగీరథకు ముందు ఉన్న తాగునీటి పథకాలను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారు. గతంలో గ్రామాల్లో ఉన్న బోర్లు, చేతిపంపులను అధికారులు పరిశీలిస్తున్నారు. వీటన్నింటినీ వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తాగునీటి ఎద్దడిని ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ అధికారులకు ఇటీవల స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీని దరిమిలా ఎంపీవో మహేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం మండలంలోని బస్వాపురం, మాచర్ల, బలిగేర, వివిధ తండాలను సందర్శించి బోర్లు, చేతి పంపులను పరిశీలించారు. ఇదిలా ఉండగా రాబోయే కొద్దిరోజుల్లోనే బోర్లు, చేతిపంపులను బాగుచేయించి వినియోగంలోకి తీసుకరానున్నారు.

## అంగన్‌వాడీల్లోనే భోజనం చేయాలి

- జిల్లా సంక్షేమ శాఖాధికారి లక్ష్మీబాయి



మాట్లాడుతున్నజిల్లా సంక్షేమ శాఖాధికారి లక్ష్మీబాయి

ఆత్మకూరు, మార్చి 22 : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీబాయి పేర్కొన్నారు. శుక్రవారం 2, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పోషణ పక్షం వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను టై టేబుల్ ప్రకారం బోధించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వారికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. చిరుధాన్యాలు ఆహారంలో తీసుకుంటే తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారన్నారు. మహిళల్లో రక్తహీనత నివారణకు చిరుధాన్యాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా దివ్యాంగులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో భారతి, సూపర్‌వైజర్లు శ్రీలత, సబిత, నర్మద, అంగన్‌వాడీలు విజయలక్ష్మి, సంధ్యారాణి, రాణి, రఫీకాభాను, హసీనాబేగం, ఖాజియాబేగం, బాలకిష్టమ్మ, సంగీత పాల్గొన్నారు.

### ఘనంగా పోషణ పక్షోత్సవం

గట్టు, మార్చి 22 : స్థానిక ఐకేపీ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కమలాదేవి, సూపర్‌వైజర్లు వాసంతి, సంధ్యారాణి హాజరై రక్తహీనతను తొలగించడానికి మార్గాలు, చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారి అఫ్జల్, ఐకేపీ సీసీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

## బీజేపీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి

పెద్దమందడి, మార్చి 22 : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి హాజరై శక్తి కేంద్ర ఇన్‌చార్జి బూత్ అధ్యక్షులు, కార్యకర్తలకు పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించే బీజేపీ పార్టీ సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖాన కార్మికుల వేతనాలు చెల్లించాలి



వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

వనపర్తి, మార్చి 22 : వనపర్తి ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న సెక్యూరిటీ, సూపర్‌వైజర్, కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేస్తూ డిప్యూటి సూపరింటెండెంట్ రంగారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వేతన బడ్జెట్ రాలేదన్న సాకు చూపుతూ ఏజెన్సీ నిర్వాహకులు కార్మికులకు వేతనాలు చెల్లించుకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వేతనం అందకపోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎడ్యుకేషన్ పరిధిలోని ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కళాశాలలకు డిసెంబర్ నెల నుంచి వేతనాల బడ్జెట్ విడుదల చేయకపోవడం సమంజసం కాదన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జనరల్ దవాఖాన ఆర్‌ఎంవో ప్రభాకర్, ఏవో రవిశంకర్, యూనియన్ నాయకులు గంధం శ్రీను, నర్సింహ, రాజేశ్, జలాల్, నరేందర్, రాము, శ్రీనివాసులు, ముజహిద్, నాగరాజ్, ఉదయ్‌కుమార్, శాంతన్న, చంద్రశేఖర్, కళావతి, ఇందిరా, శకుంతల, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, మార్చి 22 : జిల్లా కేంద్రంలోని జామా మసీదులో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని విందును స్వీకరించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సతీశ్, చీర్ల విజయ్‌చందర్, కౌన్సిలర్ లక్ష్మీ రవియాదవ్, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల రాజీనామాలు ఆమోదం

వనపర్తి, మార్చి 22 : వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ వాకిటి శ్రీధర్ ఈనెల 19వతేదీన మున్సిపల్ కార్యాలయంలో చేసిన రాజీనామాలను శుక్రవారం కలెక్టర్ తేజస్‌నందల్ ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. కలెక్టర్ ఆమోదించిన రాజీనామా పత్రాలను ఎన్నికల కమిషన్‌కు పంపించారని, ఎన్నికల కమిషన్‌ను నిర్ణయం మేరకు కౌన్సిల్ సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

## పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

గద్వాలటౌన్, మార్చి 22 : మున్సిపాలిటీ పరిధిలోని పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్ సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని న్యూహౌసింగ్‌బోర్డు, వివిధ కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పార్కుల నిర్వహణ, నెలకొన్న పారిశుధ్యంపై అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే పార్కుల్లో మొక్కలను నాటాలని, లైటింగ్ సౌకల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు

అయిజ, మార్చి 22 : పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆస్తిపన్ను వసూలు ముమ్మరం చేశారు. 2023-24 ఏడాదికి గానూ రూ.1.76 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండటంతో మున్సిపల్ సిబ్బంది పాత బకాయిలతోపాటు ఈ ఏడాది ఆస్తిపన్నులు వసూలు చేస్తున్నారు. శుక్రవారం నాటికి రూ.1.31 కోట్లు వసూలు చేశామని, ఈ నెల చివరి నాటికి వంద శాతం వసూలు చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు మున్సిపల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సత్యబాబు పర్యవేక్షణలో రెవెన్యూ, బిల్ కలెక్టర్లు ఆస్తిపన్ను వసూలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ఘనంగా రేణుకాచార్యుల జయంతి

కొత్తకోట, మార్చి 22: మండంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలోని దత్తకోటిలింగేశ్వర ఆలయంలో ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రేణుకాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కండక్టర్ శేఖరయ్య మాట్లాడుతూ వీరశైవ మతస్థాపనకు లింగం నుంచి రేణుకాచార్యులు ఉద్భవించి శివశక్తిని ప్రచారం జరిపారని అంతటి మహినిత్వమైన రేణుకాచార్యుల జయంతిని నిర్వహించుకోవడం సంతోషానిచ్చిందన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్ స్వామి, మహేశ్వర్, విశ్వనాథం, జగదీశ్, అర్చకులు అనిల్ పాల్గొన్నారు.

## జములమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.27.28లక్షలు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

గద్వాల రూరల్, మార్చి 22 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ జాతర అనంతరం ఆలయ హుండీని శుక్రవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో పురేందర్, ఆలయ చైర్ పర్సన్ గాయత్రీ, భక్తుల సమక్షంలో లెక్కించారు. 45రోజులకు గానూ రూ.27,28,309 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. అదేవిధంగా మిశ్రమ బంగారం 28గ్రాములు, మిశ్రమ వెండి 12 కేజీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.